# మనసులోని ముల్లె

శీలా వీర్రాజు





"అయితే రాలేరన్న మాట?"

కోపమూ, పోటమితో సడలిపోతున్న పట్టుదల వెనక దిగులూ, కట్టి పడేయలేని అసహాయతలోని చిరాకూ, చిరునవ్వు విరిగిపోయిన పెదాల బిగింపులో జారిపోనీయక అణచిపడుతున్న ఆత్మాభిమానమూ యింకా ముఖంలో ఎరుపూ, చూపుల్లో తీక్ష్ణతా, మాటల్లో పదునూ......

ఇంత పెద్ద కల్లోలాన్ని చూసి జడిసిపోయాడు మనోహర్రావు సన్నని ఉల్లిపొర కాగితంలాంటి అతని మనసు అల్లల్లాడిపోయింది. కంటి రెప్పల్లో దిగులు రెప రెపలాడింది. జాలిగా, బాధగా, భయంగా తనలోకి తనే చూసుకుంటూ "బుధవారం సాయంకాలం కాస్త పనుంది, మర్నాడు వస్తా లెండి" అన్నాడు.

"మర్నాడెందుకూ. మర్నాడు నాకేం పనులూ వుండవనుకున్నారా. మీగురించి చూస్తూ వుండడంకన్న నాకు మరోపనేమీ లేదని ఎందుకనుకుంటారూ?"

అర్థం కాని అయోమయంతోనూ, పెద్ద తప్పు చేసి దిక్కుతోచక నిలబడినప్పటి అసహాయతతోనూ, మనసును కళ్లల్లో నిలుపుకుని దీనంగా నిలుచుండిపోయాడు. అలా నిలుచుని నిలుచుని—

"మరీ అంత అవసరమైన పనైతే చెప్పండి, వస్తాను. నాపనంటారా—ఎప్పుడూ ఉండేదే" అన్నాడు. అలా అన్నప్పుడు కంఠం పొడుగ్గా సాగదీశాడు. సన్నగా చిరునవ్వును ఆ చుట్టూ బోర్డరుగా గీశాడు. తనలోంచి చూపుల్ని తీసేసుకుని ఎదుటి ముఖంలో నిలిపాడు. అసలు ఆమాట అనడానికి ముందు కంఠం సవరించుకున్నాడు. పెదాల్ని నాలుకతో తడుపుకున్నాడు. అరిచేత్తో ముఖాన్ని తుడుచుకున్నాడు.

కొద్దిసేపు ఆమె ఆ వుల్లిపొర కాగితం రెప రెపల్ని ఆలకిస్తూ వుండిపోయింది.

"నాగురించి మీ పనుల్ని మానుకోనక్కర లేదులెండి. ఆ రోజు నా పుట్టిన రోజు కదాని పిలిచాను. తీరిక లేకపోతే సరే, బలవంతం చెయ్యను" అంది.

"పుట్టిన రోజా!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

అవునన్నట్టు తలూపింది.

అతని ఉత్సాహం మీద గిలిగింతలు పెట్టి చిరునవ్వుల్ని కదిలించాల్సిన ఆ మాట అతని ఆత్మాభిమానం మీద ముల్లులాగ గుచ్చుకుంది.

ఆ విషయం ముందే ఎందుకు చెప్పకూడదూ. చెప్తే రాననలేదేతను. ఆ విషయం తెలిసి కూడా మరెందు కలా చేసింది! ఆమె గురించే తను వస్తున్న విషయం తెలుస్తూ వుండగా మళ్లీ దాన్ని ప్రత్యేకించి బయట పెట్టడంలో ఆమె ఉద్దేశం ఏమిటి? ఆమె గురించే తను అభిప్రాయాన్ని మార్చుకున్నాడనీ, ఆమె ఆకర్షణ అంత బలీయమైనదనీ, ఆమె మీద తనకే అభిమానం వున్నదనీ ఒట్టబయలు చేస్తే ఆమెకు ఒరిగే దేమిటి? ఎందుకా నిర్లక్ష్యం?

ఆమె మీద చిరుకోపం, కొంతంత ఉక్రోషం కూడా వచ్చాయి.

అతని ముఖంలోకి చూస్తూ కూర్చున్న స్వచ్ఛిత మెల్లగా కదిలి "పోనీ లెండి. మీలు లేకపోతే మీరు మాత్రం ఏం చెయ్యగలరు, ఈ మాత్రానికి అంతగా ఆలోచించాల్సిన అవసరం దేనికీ" అంది.

ఈసారి అతనికి "నిజంగానే నేన్న

"లాలేను" అని అరవాలనిపించింది. నాలుగైదు సార్లు ఆ మాటని నోట్లో అనుకుని కూడా, ఆమె ముఖంలోకి చూసి, తనవైపే సూటిగా చూస్తోన్న ఆమె చూపులకి, ఆ చూపులో తన మీద కుమ్మరించిన వెలుగు రేఖలకి తనలోని బలహీనతే తనకే కనిపించి సిగ్గుపడి తల వాల్చేసుకున్నాడు.

"సరే, వస్తాలెండి" అని చెప్పి, దిద్దుతున్న ప్రాక్టికల్ నోటు పుస్తకాల్ని అలమార్లో పెట్టేసి, వెళ్తున్నట్టు ఆమెకు సంజ్ఞతోనే చెప్పి కదలబోయాడు.

ఉత్తరం రాసుకుంటున్నదల్లా మధ్యలోనే ఆపి "వెళ్తున్నారా... నాకూ అటువైపే కాస్త పనుంది. వెళ్దామా వద్దా అని ఆలోచిస్తున్నాను" అంది.

అదిగో! మళ్ళీ అలాగే మాట్లాడుతోంది. నేనూ వస్తానని ఎందుకనదూ. తన చేత రండి అని పిలిపించుకోవాలనా?

— అతనికి కోపమూ, అభిమానమూ కలిగి, పట్టుదల పెరిగి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

రెండు నిమిషాలు అలానే వూరుకుని, చూడగూడదనుకుంటూనే ఆమె ముఖంలోకి చూసి, అలా చూస్తూనే—

"వేగంగా తెమలండిమరి. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఈ కెమిస్ట్రీస్టాఫ్‌లో మిగిలింది మనిద్దరమే. అంతా అరగంట క్రితమే వెళ్ళిపోయారు." అన్నాడు.

ఆమె కొద్దిసేపు తటపటాయించి "సరే లెండి. మీరు వెళ్ళండి, తర్వాత వస్తాను" అంది.

ఆ మాట ఆమె చెప్పడం పూర్తికాకుండానే అతను గది బయటికి వచ్చేశాడు. దారిలో రోజూ చూసే పూలకుండీల వేపన్నా చూడకుండా, మెట్ల దగ్గర ఆర్చీమీదకు పాకించిన మాలతీలతలో నిష్కల్మషంగా నవ్వే తెల్లటి పూగుత్తుల్ని కనీసం నిర్లక్ష్యపు చూపులోనన్నా పరామర్శించకుండా, రసదృష్టినీ, చిరునవ్వునీ దాచేసుకుని, కోపాన్నీ, అసహనాన్నీ ముఖం మీద అద్దుకుని గబగబా, రోజుకన్నా వేగంగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

రాత్రి చాలాసేపు నిద్ర పట్టలేదు. ఇంత కాలంగా తను ప్రతిష్ఠించుకున్న రూపం ఎండకు ఎండి, వర్షానికి తడిసి పెచ్చులు వూడొచ్చేస్తోంది. ఇంకొద్ది రోజుల్లో అక్కడ ఏమీ మిగలదు. మనసు నిండా అదే బాధ. అర్థం లేని ప్రతి విషయానికీ ఎన్నో అర్థాల్ని చెప్పుకుని, తెలివి తక్కువగా కోరికల్ని పెంచుకుని, యిప్పుడిలా భంగపడుతున్నందుకు తనమీద తనకే జాలి కలిగింది. ఆలోచిస్తున్న కొద్దీ ప్రతి చిన్న విషయమూ ఆమె మీది కోపానికి సమిధ అయ్యింది. గుప్పున కోపం రగిలి, కొద్దిసేపు ఎర్రగా మండి, మంచి తనపు చల్లగాలిలో కరిగిపోతోంది. అలా కరగకుండా వున్న ఒక సందర్భంలో అతడనుకున్నాడు—

ఆమె అంత నిర్లక్ష్యంగా వుంటున్నప్పుడు తానెందుకు నిర్లక్ష్యంగా ప్రవర్తించకూడదూ. ఆమె పుట్టిన రోజునాడు వట్టి చేతులోనే వెళ్ళాలి. ఏ బహుమతీ తీసుకెళ్ళగూడదు. ఆమె చూపించని ప్రత్యేకత తానెందుకు చూపించాలి? చూపించగూడదు. అంతే, అలానే చెయ్యాలి.

మర్నాడు మంగళవారం— కాలేజీలేదు. ముసల్మానుల పండగ. బుధవారం నాడు ఆమె సెలవు పెట్టింది. అతను మాత్రం వెళ్ళాడు. ఉదయం, మధ్యాహ్నం ప్రాక్టికల్ క్లాసులున్నాయి. వాళ్ళిద్దరూ అక్కడ కెమిస్ట్రీ డిమాన్‌స్ట్రేటర్లే. ఆమెకన్నా అతను రెండేళ్ళు సీనియర్ అక్కడ. డిమాన్‌స్ట్రేటర్‌గా పని చేస్తూ ఎమ్.ఎస్సీకు కట్టాలని అతని ప్రయత్నం.

సాయంకాలం కాలేజీ విడిచి పెట్టగానే తిన్నగా యింటి కొచ్చేశాడు. నాలుగున్నరే అయ్యింది. బాగా ఆలస్యంగా వెళ్ళొచ్చులే అనుకున్నాడు. ఆరింటిదాకా యింట్లోనే కూర్చుని అప్పుడు మెల్లగా కదిలాడు.

ఆమె యిల్లు మైలు దూరం కూడా ఉండదేమో. రిక్షా అయితే వేగంగా వెళ్ళిపోతుంది. నడిచయితేనే మంచిది. బాగా ఎదురు చూడనిచ్చి అప్పుడు వెళ్తే సరి. తనను యింతగా ఏడిపించిందికదా. ఆమెను తానెందుకు ఏడిపించ కూడదు?— అనుకున్నాడు.

అడుగుల్లో అడుగులు వేసుకుంటూ తీరుబాటుగా నడుస్తూ బయలు దేరాడు. బయలుదేరాడే కాని మనసంతా అదోలా వుంది. ఏ బహుమతీ తీసుకెళ్ళక పోవడం బావున్నట్టు అనిపించలేదు. అది తన నిర్లక్ష్యంగా భావించకుండా పిసినిగొట్టుతనం గానో, బీదతనం గానో ఆమె భావిస్తేనో— అన్న ఆలోచన వచ్చింది. భావిస్తే తనకి నష్టమేమిటి అని సమర్థించుకున్నాడు. తెలిసి తెలిసి మరోసారి భంగపడడం తెలివి తక్కువ తనమనిపించింది. అనిపించినా ధైర్యంగా అనుకోలేక పోతున్నాడు. సందేహంగా అటూ యిటూ వూగుకొంటూనే చాలాదూరం వచ్చేశాడు.

ఇల్లు దగ్గర కొచ్చేసింది. అట్టే దూరం లేదు. మరో రెండు ఫర్లాంగులే వుంటుంది. సందు తిరిగితే వీధి వచ్చేసినట్టే.

గుప్పున ఫలసంపంగి వాసన కొట్టి ముక్కు పుటాల్ని వూపేసింది.

పక్కకు తిరిగి చూస్తే పూలమ్ముకునే కుర్రాడు వో యింటిముందు బేరం చూసుకుంటున్నాడు.

● పూలవాడిని చూసిన తర్వాత అంత వరకూ వూగులాడుతోన్న అతని మనసు వో పక్కకి ఒరిగిపోయింది. ఆ పూలంటే స్వచ్ఛితకు చాలా యిష్టం. ఎన్ని సార్లు చెప్పిందో వాటిగురించి. క్లాసులో అమరావతి అనే వో అమ్మాయి పెట్టుకొస్తుండేది. ప్రాక్టికల్ క్లాసులో అంత ఘాటైన ఏసిడ్‌ల మధ్యా, హైడ్రోజన్ క్లోరైడ్, హైడ్రోజన్ సల్ఫైడుల వంటి కుళ్ళు వాసనల మధ్యా తన వునికిని నలుగురికీ చాటుకుంటూ పరిమళాలను వెదజల్లేది. ఆ అమ్మాయి యింట్లో చెట్టు వుంది కాబోలు తరచు పెట్టుకొస్తుండేది. అది చూసినప్పుడల్లా స్వచ్ఛిత ఆ పూలను గూర్చీ, అవంటే తనకున్న యిష్టాన్ని గూర్చీ, చిన్నప్పుడు ఆ మొక్కవున్న యింట్లో అద్దెకున్నప్పటి అనుభవాలూ, వాటికై తగాదాలూ— ఏదో ఒక ప్రస్తావన లేకుండా వుండేదికాదు.

స్వచ్ఛితకు పుట్టిన రోజు కానుకగా ఆ పూలను యిద్దామనుకున్నాడు మనోహర్రావు. పూలవాడు బేరం చూసుకొని వచ్చే వరకూ రోడ్డు పక్కన సిగరెట్టు కాల్చుకుంటూ నిలుచున్నాడు. వాడిదగ్గర గులాబీలూ, చేమంతులు, ధవనం కూడా వున్నాయి. ఫలసంపంగి ఎన్నో లేవు. పదే వున్నాయి. ఆ పదీ ఖరీదు చేసి తీసుకున్నాడు. తనకని విడిగా రెండు జేబులో వేసుకుని మిగతా ఎనిమిదీ జాగ్రత్తగా జేబురుమాలలో చుట్టుకుని బయలుదేరాడు.

అతను వెళ్ళేసరికి స్వచ్ఛిత యింట్లో ఎక్కడో వుంది. వాళ్ళ చెల్లెలు వెళ్ళి పిలుచుకొచ్చింది. ఆ యింట్లో పుట్టిన రోజు ఆర్భాటం ఏమీ కనిపించలేదు అతనికి. స్నేహితురాళ్ళూ, హడావిడీ— యివన్నీ వూహించుకున్న అతనికి అవేమీ కనిపించనే లేదు.

"ఎవరూ రాలేదా?" అన్నాడు అతను కూర్చుంటూ.

"రాకపోవడ మేమిటి. ఎప్పుడో వచ్చి వెళ్ళిపోయారు, మీకయితే యిప్పుడే తెల్లారిందికానీ..."

ఆ మాటల వెనకవున్నది కోపమేనా, రుద్ధ కంఠం కూడానా అని ఆలోచిస్తున్నాడు అతను.

"ఉండండి. ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళి ప్లేటులో కొన్ని స్వీట్సూ, పాల్టు బిస్కట్లూ పట్టుకొచ్చింది.

"అవలా పెట్టండి. తింటానుగానీ, యివిగో మీకు యిష్టమైన పూలు.ముందు యివి తీసుకోండి" జేబురుమాలు విప్పి ఆమె ముందు వుంచాడు.

జేబురుమాలతో పాటు వాటిని తీసుకుని పక్కన పెట్టేసి "కాలేజీ విశేషాలు ఏమిటి చెప్పండి. ఇవ్వాళ రెండు క్లాసులూ మీరొక్కరూ చూసుకోవాల్సి వచ్చింది కాబోలు.లెక్చరర్ ఏమన్నా విసుక్కున్నాడా?" అంది.

పువ్వుల చుట్టూరా అతని మనసు తిరుగుతూండడం వల్ల కాబోలు ఆమె ఏమడిగిందో సరిగా తెలీక 'ఏమిటీ?' అని మరోసారి అడిగించుకోవాల్సి వచ్చింది. అడిగించుకుని, సమాధానం చెప్పి మళ్ళీ, పరధ్యాన్యంలో పడిపోయాడు.

"ముందవి తీసుకోండి" అని మరోసారి జ్ఞాపకం చేస్తే మెల్లగా తీసుకుంటున్నాడు.

తింటున్నవాడల్లా ఒకసారి ఆగి "ఇంత సేపూ చూసి చూసి చివరకి రానని అనుకున్నారేమిటి" అన్నాడు.

ఆమె వెంటనే "అబ్బే, అలా అనుకోలేదులెండి" అంది.

వెనువెంటనే ఆమె అలా అనేసరికి అతను ఏమీ మాట్లాడలేకపోయాడు.

"రారని అనుకోలేదులెండి. వస్తారనే అనుకున్నాను. ఆడాళ్ల ఆలస్యానికి కారణం ఒకటే. మగాళ్ల ఆలస్యానికైతే చెప్పుకోలేనన్ని కారణాలు. ఏమంటారు?"

అతను ఏమీ అనలేదు. ఏమనుకోవాలో కూడా ఆలోచించడంలేదు. ఇంత స్వాతిశయం ఏమిటీమెకు?— అన్నదే అతని ఆలోచన. 'అంటే తను రాకుండా వుండలేడనా ఆమె అభిప్రాయం?'

"ఏమిటి! మరీ పరధ్యాన్నంగా, అదోలా వున్నారు. ఏ కుర్రాళ్లతో నన్నా గొడవ

# మనసులోని కుంచె

పడ్డారేమిటి? ఆ సెకండియర్ బేబి మరీ అల్లరి బేబి."

తన మనోభావాల్ని ఆమె 'చదివేస్తున్నట్లు తోచి "అబ్బే... అలాంటిదేంలేదు" అన్నాడు చిన్నగా నవ్వి. గబగబా ప్లేటు కాళీ చేసి, మధ్యలో స్వీట్సు తయారు చెయ్యడం మీద రెండు మూడు విట్సు విసిరి, ఆమె కన్నా ముందుగా తనే నవ్వి చేతులు కడుక్కున్నాడు. చేతులు తుడుచుకుందామని జేబురుమాల కోసం జేబులో వెతికితే కనిపించలేదు. పూలతో టేబిలు మీద వుందది.

అదామె గ్రహించి పువ్వుల్ని టేబిలు మీద పడేసి రుమాలు తీసిచ్చింది. ఆ తియ్యడంలో మూడు పువ్వులు కింద పడిపోయాయి. వాటిని తీద్దామని వంగి, అందకపోతే అలాగే వదిలేసి, లేచి సరిగ్గా కూర్చుని "ఇంకాస్త ముందు వచ్చుంటే బావుండేది. అన్నయ్య అడగనే అడిగారు. ఇప్పటివరకూ చూసి చూసి, బజారుకు వెళ్లాల్సిన పనుందని, మీరు వచ్చేముందే అలా వెళ్లాడు" అంది.

అతను కుర్చీలో వెనక్కు జారపడినవాడల్లా లేచి నిటారుగా కూర్చుని అన్నాడు.

"తొందరగానే వద్దామనుకున్నాను. ఇదిగో ఈపూల గురించి వెళ్లేసరికి ఆలస్యమైపోయింది. మీకు యివంటే యిష్టం కదాని వెళ్ళి పట్టుకొచ్చాను. ఆమధ్య ఓ మిత్రుడి యింటికి వెళ్లినప్పుడు వాళ్లింట్లో చూశాలెండి. వెళ్ళి అడిగితే యింటి ఓనరు కోప్పడతాడనీ, ఆయన అరుగు మీదే తిష్టేసుక్కూచున్నాడనీ, వీలుండదనీ అన్నాడు. కాదు, కూడదని బతిమాలితే యింటాయన లోపలికి వెళ్లిపోయేవరకూ వోపిక పట్టమన్నాడు. ఎంతకీ కదిలితేనా! ఉదయం వచ్చిన న్యూస్ పేపరు సాయంకాలానికి పాతబడిపోదూ? అల్లాంటి పాతపేపర్ని సాగదీసి మరీ చదువుతూ కూర్చున్నాడు. సరిగ్గా ఆయన గురించి గంటసేపు గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవలసి వచ్చింది..."

ఆమె ఆకస్మాత్తుగా లేచి నుంచుని "అన్నట్టు! మాటల్లో పడి కాఫీ యివ్వడమే మర్చిపోయాను. చూశారా వుండండి, యిప్పుడే పట్టుకొస్తాను" అంటూ గబగబా లోపలికి వెళ్లింది.

బాధపడ్డట్టు అతను ముఖం మాడ్చుకున్నాడు.

అయిదు నిమిషాల్లో ఆమె కాఫీ తెచ్చి యిచ్చింది.

కప్పు కాళీచేసి కూర్చున్నాడు. ఆట్టే మాట్లాడాలని పించలేదు. ముభావంగానే వుండిపోయాడు. చాలాసేపు అలానే కూర్చుని వెళ్లిపోదామని లేవబోతే "కూర్చోండి, అన్నయ్య వచ్చేస్తాడు. మరో పావుగంటలో రానేవస్తాడు కదా, ఏకంగా కలుసుకునే వెళ్లిపోవచ్చు" అంది.

మనోహర్రావు తండ్రి స్వచ్ఛిత అన్నయ్యకు హైస్కూల్లో గురువుగారు—అదీ పరిచయం.

మనోహర్రావు యిబ్బందిగా కూర్చున్నాడు. ఏం చెయ్యడానికీ తోచక ఎడమ చెయ్యి అరచేతిని కుడిచేత్తో మృదువుగా రాసుకుంటూ, మధ్య మధ్య అరచేతిలోకి చూసుకుంటూ, నోటితో వూదుకుంటూ, అప్పుడప్పుడు జాడించి చెయ్యి దులిపి, మణికట్టు దగ్గర గట్టిగా పట్టుకుని వేళ్ల మధ్య రక్తాన్ని ఉబ్బించి, గాలిలో ఆడించి, ఉండుండి ముక్కుపుటాల్ని ఎగరేసి, కళ్లు చిట్లించి, నిశ్వాసంలో శబ్దాన్ని నింపి ఆమె చూపులకి ఎక్కడా అందనివ్వక దాచేస్తూ వుండగా చటుక్కున ఆమె చూసి దొంగను పట్టుకున్నంత ఉత్సాహంతో "అదేమిటి" అంది.

"అబ్బే, ఏంలేదూ" అన్నాడు వేళ్ళు ముడుచుకుంటూ.

"లేకపోవడమేమిటి ఏదో వుంది" అంది.

తలెత్తకుండానే అరచేతిలోకి చూసుకుంటూ చెప్పాడు అతను—

"సంపంగిపూలు కోస్తున్నప్పుడు పక్కనే వున్న గులాబీ మొక్కముళ్ళు గుచ్చుకున్నాయిలెండి. ఇటికలు మూడింటిని ఒకదాని మీద ఒకటి పేర్చి వాటి పైకెక్కి పైన వున్న వో పువ్వుని అందుకోబోయాను. కోసేసిన తర్వాత బేలన్సు తప్పిపోయింది. ఇటికలు కదిలిపోయాయి. జారిపోయాను. పక్కనే గులాబీ మొక్క వుంటే దానిమీద అరచెయ్యి ఆనింది. ముళ్ళు గుచ్చుకున్నాయి. చిన్నముళ్ళయినా, బలంగా చెయ్యి ఆనిందేమో రక్తం వొచ్చింది."

"ఏం రాశారు మరి?"

"టించర్ రాసి కడిగేశాను. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నొప్పి అనిపిస్తోంది. అంతే, మరేంలేదు"

"రాత్రి పడుకునే ముందు మరోసారి రాయండి. పొద్దుటికి అదే తగ్గిపోతుంది."

ఈ సలహా ఎవరికావాలి?...ఒక్కమాట తన గురించి యింత కష్టపడినందుకు గుర్తింపుగా ఒకే ఒకమాట ఎంత చిన్నదైనా చాలు—అనదేం? ఎంత నిర్లక్ష్యం!

అతను ఉక్రోషం పట్టలేకపోయాడు. బురద చిమ్మినట్టు ముఖం మీదకు కోపం చిమ్మి ఎర్రబడిపోయింది. అతనికి ఎంత కోపం వచ్చిందంటే మంచినీళ్ళు కావాలని చెప్పి, తేవడానికని ఆమె లోపలకు వెళ్ళగానే చెప్పాచెయ్యకుండా అక్కడ్నుంచి పారిపోయి వచ్చేద్దామన్నంత కోపం వచ్చింది.

ఆ వుద్దేశంతోనే "మంచినీళ్ళు కావాలి" అన్నాడు.

చెల్లెల్ని కేకేసి పట్టుకు రమ్మంది.. ఆ అమ్మాయి తెచ్చిన తర్వాత యిక తాగక తప్పలేదు అతనికి. విచిత్రం! అతనికి, యిప్పుడు నిజంగానే దాహంవేసి, అగ్లాసుడు నీళ్ళూ గడగడా తాగేశాడు. రెండు నిమిషాలు మౌనంగా కూర్చుని మెల్లగా తనను తనే సమాధానపరచుకున్నాడు. రుమాలుతో ముఖం మీది చెమటను తుడుచుకుంటూ దానితోపాటే కోపాన్ని తుడుచేసుకున్నాడు. తన కంఠం తనకే లొంగే స్థితిలో లేదేమో నన్న భయంతో పొడిపొడిగా అయిదారు సార్లు దగ్గి దాన్ని సరిచేసుకున్నాడు. ఆతర్వాత—

"ఇందాక లక్కీగా వో ఏక్సిడెంట్ తప్పిపోయింది. పొద్దున్న లేచిన వేళా విశేషం.. వెంట్రుక వాసిలో ప్రమాదం తొలగిపోయింది. సంపంగిపూలు పుట్టుకరావడానికని వెళ్ళి వస్తున్నప్పుడు కూరగాయల మార్కెట్ టర్నింగ్‌లో సడన్‌గా వో లారీ వచ్చేసింది. తప్పించడానికి కూడా వ్యవధి లేదు. ఏం చెయ్యాలో తోచక రెండు బ్రేకులూ వేసేసాను. సరిగ్గా సైకిలు ముందు చక్రాన్ని రాసుకుంటూ పోయింది లారీ. నిజంగా పునర్జన్మ ఎత్తినట్టే."

"ఈ లారీవాళ్ళు మరీ రెష్ డ్రైవింగ్ లెండి. వెనకాముందూ చూసుకోనైనా చూసుకోరు. చిత్తుగా తాగివుంటారేమో, వాళ్ళను పట్టే పగ్గాలుండవు. అందులో యీ వూళ్ళో మరీ దారుణం. తరచుగా వారానికి ఒక ఏక్సిడెంటన్నా జరుగుతూనే వుంటుంది. మొన్నటికి మొన్న కాలేజీ రోడ్డు మీద చూడండి.. పుల్లలేసుకొస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టి ఆపకుండా పోలేదూ. మన కుర్రాళ్ళు నంబరు నోట్ చేసుకోబట్టి గాని లేకపోతే వాడు దొరికేవాడేనా. ఈ వూరికి కంకర క్వారీ లొకటి. ఇరవై నాలుగ్గంటలూ ఒకటే ట్రాఫిక్. వీటికి తోడు పోలీసువాళ్ళు కూడా అలాటి వాళ్లే తగలడ్డారు. ఇలా పట్టుకుని, అలా వాళ్ల మామూళ్ళు వాళ్ళు తీసుకుని ఒదిలేస్తుంటారు...."

మనోహర్రావులో సహనం సన్నగిల్లిపోతుంది. ఉక్రోషం పట్టలేకపోయాడు. చివాల్న లేచిపోయి "నాకు చాలా ఆలస్యమయ్యింది. నేను వెళ్ళాలి" అంటూ ఆమె సమాధానమన్నా వినకుండా గబగబా వీధిలోకి వచ్చేశాడు.

ఆమె క్షణంపాటు తెల్లబోయి, అతర్వాత తెప్పరిల్లి, ఆ వెనకే వరండాలో కొచ్చి "సరేలెండి, అన్నయ్యతో చెప్తాను యింతసేపూ కూర్చుని వెళ్ళారని. వీలు చూసుకుని మరోసారి ఎప్పుడన్నా రండి" అంది.

ఆమె మాటలు వినిపించనట్టు అతను వెనక్కు తిరగనైనా తిరగకుండా గబగబా వెళ్ళిపోయాడు. ఆ వెళ్తున్న అతన్ని కొద్దిసేపు అరుగు మీద నుంచుని చూసి, తలు పులు వేసుకుని లోపలకు వెళ్ళిపోయింది.

గబగబా వెళ్ళిపోతున్న మనోహర్రావు చటుక్కున ఆగిపోయాడు. పెద్ద పెద్ద అంగలతో వెనక్కితిరిగి వచ్చాడు. మెల్లగా మెట్లెక్కి కిటికీ ముందు నుంచున్నాడు. గదిలో స్వచ్ఛత—

మోకాళ్ళ మీద వంగి టేబిలు కింద పడిపోయిన మూడు సంపంగి పూలనూ ఏరుకుని జాగ్రత్తగా, సుతారంగా చీర కొంగుతో వాటికి అంటుకున్న మట్టి తుడిచి లేచి నుంచుని, సంపంగి పూలన్నిటినీ దోసిట్లోకి తీసుకుని చాలాసేపు వాటినే చూస్తూ వుండిపోయి, ఆ తర్వాత పారవశ్యంతో మెల్లగా జార్చిన కనురెప్పల మీద అద్దుకుని కొద్దిసేపు ఆ చల్లదనాన్నీ, పరిమళాన్నీ ఆస్వాదిస్తూ వుండిపోయింది. ●

